


18 నుంచి యూజీ ప్రవేశ పరీక్షలు

బెంగళూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వృత్తిపరమైన కోర్సుల్లో ప్రవేశాని కి సంబంధించి కర్ణాటక పరీక్షా ప్రాధికార యూజీసీఈటీ పరీక్షల తేదీలను ప్రకటించింది. ఏప్రిల్ 18, 19 తేదీలలో యూజీసీఈటీ పరీక్షలు జరుగుతాయని రాష్ట్రంలోని అన్ని జిల్లా, తాలూకా కేంద్రాల్లో నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నామని ప్రాధికార ప్రకటించింది. పరీక్షా కేంద్రాల ఎంపిక చేపట్టామని, విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించింది. ఇంజనీరింగ్, యోగా అండ్ నేచురోపతి, వెటర్నరీ సైన్స్, అగ్రికల్చర్ సైన్స్, సిరికల్చర్, బీఎస్సీ, బీఫార్మా, డీ ఫార్మా తదితర కోర్సులకు సంబంధించి ప్రవేశపరీక్ష ఉంటాయి.

కొలిక్కి వచ్చిన కూటమి జాబితా

- బీజేపీలో ఒక్కస్థానమే పెండింగ్ - నేడు జేడీఎస్ అభ్యర్థుల ప్రకటన - మారుతున్న రాజకీయ సమీకరణలు



బెంగళూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి బీజేపీ, జేడీఎస్ కూటమి జాబితా ప్రకటన దాదాపు పూర్తయింది. బీజేపీ ఇక కేవలం ఒక అభ్యర్థి పేరును మాత్రమే ఖరారు చేయాల్సి ఉంది. పొత్తులో భాగంగా తనకు లభించిన 25 స్థానాలకు గాను 24 స్థానాల అభ్యర్థులను రెండు విడతల్లో ఇప్పటికే ప్రకటించింది. చిత్రదుర్గ టిక్కెట్ మడతపేచీ ఇంకా కొనసాగుతోంది. ఇక్కడ కేంద్ర మంత్రి ఎ. నారాయణస్వామిని కాదని మాజీ ఉపముఖ్యమంత్రి గోవింద కారజోళను బరిలోకి దింపే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇక జేడీఎస్ తన వాటాకింద వచ్చిన మూడు నియోజకవర్గాల అభ్యర్థుల ఎంపిక కసరత్తు మంగళవారం ప్రారంభించింది. బెంగళూరు పద్మనాభనగర్ లోని మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి నివాసంలో రోజంతా ఈ కసరత్తు సాగింది. మండ్య, హాసన్, కోలారు నియోజకవర్గాల అభ్యర్థుల పేర్లను ఖరారు చేసేందుకు విస్తృతంగా చర్చలు జరిపారు. పార్టీ వర్గాలు అందించిన సమాచారం ప్రకారం మాజీ సీఎం కుమారస్వామి స్వయంగా మండ్య నుంచి బరిలోకి దిగాలని కోర్ కమిటీ సమావేశంలో అత్యధికులు అభిప్రాయపడినట్టు తెలుస్తోంది. హాసన్ నుంచి ప్రస్తుత సిట్టింగ్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ పేరు దాదాపుగా ఖరారైంది. ఇక కోలారు నుంచి మల్లేశ్‌బాబు లేదా నిసర్గ నారాయణస్వామిలలో ఒకరిని టిక్కెట్ వరించే అవకాశం ఉంది. దీనిపై తుది నిర్ణయం తీసుకునే అధికారాన్ని మాజీ ప్రధాని, దళపతి దేవెగౌడ నిర్ణయానికి వదిలేసినట్టు కోర్‌కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జీటీ దేవెగౌడ సమావేశం అనంతరం మీడియాకు చెప్పారు. బుధవారం తమ అభ్యర్థుల జాబితాను అధికారికంగా ప్రకటిస్తామన్నారు. అభ్యర్థుల ఎంపికలో ఎలాంటి ఇబ్బందికరమైన పరిస్థితి లేదన్నారు. కుమారస్వామి అనారోగ్యం కారణంగానే జాబితా విడుదలలో జాప్యం జరిగిందన్నారు. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ సమీకరణల మార్పు తథ్యమని, ఫలితంగా అన్ని నియోజకవర్గాల్లోనూ దాదాపు ముఖాముఖి పోటీలే ఉంటాయని రాజకీయ పరిశీలకులు మదింపు వేస్తున్నారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వ విజయాలు, మోదీ చరిష్మాపైనే బీజేపీ అధికంగా ఆధారపడింది. నియోజకవర్గాల్లో తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున్న 13 మందికి బీజేపీ ఈసారి టిక్కెట్ ఇవ్వలేదు. వీరిలో ఇద్దరు ఏకంగా రాజకీయాల నుంచి వైదొలగుతున్నట్టు ప్రకటించారు. తమకు, తమ వారసులకు టిక్కెట్లు దక్కని నేతలు కొందరు తిరుగుబావుటా ఎగురవేశారు. ఫలితంగా కొన్ని నియోజకవర్గాల్లో ఇటు బీజేపీకి, అటు కాంగ్రెస్‌కు ప్రతికూల పరిస్థితులు తప్పవనే మాట వినిపిస్తోంది. ఇక అధికార కాంగ్రెస్ విషయానికి వస్తే పూర్తిగా గ్యారెంటీలపైనే బోలెడు ఆశలు పెట్టుకుంది. ఇవి తప్పకుండా తమకు ఓట్ల వర్షం కురిపిస్తాయని కాంగ్రెస్ నేతలు గంపెడాశతో ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థుల జాబితాలో ఇంకా 8 పేర్లు కావాల్సి ఉంది. ఏ క్షణంలోనైనా ఈ జాబితా విడుదలయ్యే అవకాశం ఉంది. కేంద్రప్రభుత్వం రాష్ట్రంపట్ల చూపుతున్న నిర్లక్ష్య వైఖరి ప్రధాన అస్త్రంగా బీజేపీపై ఎక్కుపెట్టేందుకు కాంగ్రెస్ నేతలు సన్నాహాలు చేసుకుంటున్నారు.


కుమారస్వామితో బీజేపీ నేతలు

కుమారస్వామిని పరామర్శించిన బీజేపీ నేతలు

బెంగళూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, జేడీఎస్ ముఖ్యనేత హెచ్‌డీ కుమారస్వామి నివాసానికి బీజేపీ నేతలు మంగళవారం వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని పరామర్శించారు. ఈ సందర్భంగా బెంగళూరు నార్త్ బీజేపీ అభ్యర్థి శోభాకరంద్లాజే, మాజీ ఉపముఖ్యమంత్రి సీఎన్ అశ్వత్థ నారాయణ, దాసరహళ్లి ఎమ్మెల్యే మునిరాజు ఉన్నారు.

కేంద్రమంత్రి జోషికి పెను సవాల్



- స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దింగాలేశ్వర స్వామి..?



బెంగళూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ధార్వాడ నుంచి సునాయాసంగా విజయం సాధించాలని భావిస్తున్న కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషికి పెను సవాల్ ఎదురుకానుంది. ప్రహ్లాద్‌జోషి బీజేపీ నుంచి ఐదోసారి ధార్వాడ అభ్యర్థిగా పోటీలోకి దిగుతున్నారు. కాంగ్రెస్ నుంచి వినోద్ అసోటిని అభ్యర్థిగా ప్రకటించారు. ఇద్దరి నడుమ పోటీ సాగినా విజయం సాధించవచ్చునని ప్రహ్లాద్‌జోషి అంచనా వేశారు. శిరహట్టి మఠం జూనియర్ మఠాధిపతి ఫకీర దింగాలేశ్వరస్వామి ధార్వాడ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారు. ధార్వాడ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 8 శాసనసభ స్థానాలు ఉన్నాయి. ఈ ప్రాంతమంతా శిరహట్టి మఠం సేవలు కొనసాగుతున్నాయి. గడిచిన కొన్నేళ్లుగా స్వామిజీ కలుషితమైపోతున్న రాజకీయాలను శుద్ధీకరించాల్సిన అవసరం ఉందని పలు సందర్భాలలో ప్రస్తావించారు. ప్రస్తుతం ఆయన పోటీ చేసే విషయమై శాసనసభ నియోజకవర్గాల వారీగా ప్రజలు, భక్తుల నుంచి మద్దతు కూడగడుతున్నారు. ఆయన పోటీ చేసే విషయాన్ని ఒకటి రెండురోజుల్లో ప్రకటించే అవకాశం ఉంది. స్వామిజీ ప్రజాదరణ కల్గినవారు. ధార్మిక, సామాజిక, రాజకీయ అంశాలపై అనుభవంతో ప్రసంగాలు చేస్తారు. లింగాయతలకు ప్రత్యేక మతంగా గుర్తించాలని సిద్దరామయ్య ప్రభుత్వం ఐదేళ్ల క్రితం తీసుకున్న నిర్ణయంపై తీవ్రంగా వ్యతిరేకించారు. అప్పట్లో ఆయన పోరాటాలు చేశారు. రాజకీయ లబ్ధి కోసమే లింగాయతలను విడగొట్టాలని కుట్ర పన్నారని ఆరోపించారు. ఇటీవల బీజేపీ ప్రభుత్వంలో అవినీతిపైనా మండిపడ్డారు. మఠాలకు కేటాయించిన గ్రాంట్లలోనూ అధికారులు కిక్‌బ్యాక్ పొందారని నేరుగా విమర్శించారు. గదగ్ జిల్లా బాళెహోసూరు దింగాలేశ్వర మఠం హిందూ ముస్లింల సమైక్యత పెంచడంలో పేరొందిన శిరహట్టి ఫకీరేశ్వర మఠాధిపతిగా దింగాలేశ్వరస్వామిజీ వ్యవహరిస్తున్నారు. హుబ్బళ్లి-ధార్వాడ ప్రాంతంలో వీరశైవలింగాయతలు అత్యధికంగా ఉన్నారు. స్వామిజీ ఎన్నికల్లో పోటీ చేస్తే అత్యధికంగానే ఓట్లు పొందే అవకాశం ఉంది. ఓట్లు చీలితే ఫలితం మారే అవకాశం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని రోజుల క్రితమే మఠంలో తులాభారాన్ని నిర్వహించారు. ఏనుగు బరువుతో సమానంగా 5,555 కిలోల నాణేలతో తులాభారం నిర్వహించారు.


దింగాలేశ్వరస్వామి


రంజాన్ వేళలు

ఇఫ్తార్ : బుధవారం సాయంత్రం 6:33
సెహరి : గురువారం ఉదయం 05:05

డీకే సురేశ్‌పై చర్యలు తీసుకోండి

- కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశం

బెంగళూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు గ్రామీణ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి డీకే సురేశ్‌పై తక్షణం చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ఎన్నికల సంఘానికి సూచనలు జారీ చేసింది. కాంగ్రెస్ అభ్యర్థి డీకే సురేశ్ ఓటర్లను ప్రలోభ పరిచేందుకు ఉచిత కానుకలను యథేచ్ఛగా పంపిణీ చేస్తున్నారంటూ మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసిన నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. డీకే సురేశ్ ఎన్నికల అక్రమాలపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, అందుకే కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాయాల్సి వచ్చిందని దేవెగౌడ పేర్కొన్నారు.

హైకోర్టులో ఎమ్మెల్యే రిజ్వాన్‌కు ఊరట

బెంగళూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు శివాజినగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్‌కు ఊరట లభించింది. ఆయనపై దాఖలైన ఎన్నిక ల పిటీషన్‌ను హైకోర్టు మంగళవారం రద్దు చేసింది. శాసనసభ ఎన్నికల్లో శివాజినగర్ నుంచి ఎన్నికైన రిజ్వాన్ అర్షద్ గ్యారెంటీ పథకాల పేరిట ప్రజలను ప్ర లోభ పరిచారని, ఆయన ఎన్నికను రద్దు చేయాలంటూ ఈ నియోజకవర్గానికి చెందిన బి.లక్ష్మీదేవి దాఖలు చేసుకున్న పిటీషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.విశ్వజిత్‌శెట్టి ధర్మాసనం దీన్ని కొట్టివేసింది. ఓటర్లను ప్రలోభపరిచారని పిటీషనర్ నిరూపించలేకపోయారని, గ్యారెంటీలు ఎన్నికల హామీ కిందకే వస్తాయని ధర్మాసనం పేర్కొంది.

సురపుర బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా రాజుగౌడ



బెంగళూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే అకస్మిక మృతి కారణంగా ఖాళీ కావడంతో సురపుర నియోజకవర్గానికి నిర్వహించనున్న ఉప ఎన్నికల్లో బీజేపీ తన అభ్యర్థిగా మాజీ మంత్రి నరసింహనాయక్ అలియాస్ రాజుగౌడను బరిలోకి దించింది. ఈ మేరకు బీజేపీ అధిష్ఠానం మంగళవారం ఆయన పేరును అధికారికంగా ప్రకటించింది. రాజుగౌడ గతంలో మంత్రిగానూ సేవలందించారు. ఏడాది క్రితం జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఆయన సురపురం నుంచి బీజేపీ టిక్కెట్‌పై పోటీచేసి ఓడిపోయారు.

ధర్మయుద్ధానికి సిద్ధం

- గ్యారెంటీలతో అన్ని వర్గాలకు లబ్ధి
- ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

బెంగళూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ధర్మయుద్ధానికి సిద్ధమవుతున్నామని, అంతకు ముందు ధర్మస్థళ మంజునాథస్వామి, అణ్ణప్పస్వామి దర్శనం చేసుకున్నానని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పేర్కొన్నారు. ధర్మస్థళలో మంగళవారం ధర్మస్థళ ధర్మాధికారి డాక్టర్ వీరేంద్ర హెగ్డేతో ఆయన భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రతిసారి ధర్మయుద్ధం ప్రారంభించే ముందు మంజునాథ స్వామి దర్శనంతో ఆశీర్వాదం పొందడం తనకు ఆనవాయితీగా ఉందన్నారు. లోక్‌సభ ఎన్నికల సమరానికి సన్నద్ధంగా ఉన్నామని, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని ఐదు గ్యారంటీ పథకాలను పక్కాగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజల మధ్యకు వెళ్లి గ్యారంటీల అమలు కోసం తమకు మరింతగా శక్తినివ్వాలని విన్నవించుకుంటామన్నారు. రాష్ట్రంలో నేడు పుణ్యక్షేత్రాలు, ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయంటే అది తమ గ్యారెంటీ పథకమైన శక్తి ప్రభావమే అన్నారు. గ్యారెంటీలతో అన్ని వర్గాల ప్రజలు, అన్ని రాజకీయ పార్టీల ప్రజలు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. గ్యారెంటీలతో ప్రజల రుణం తీర్చుకునే భాగ్యం తమకు లభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కొవిడ్ అనంతరం ఛిన్నాభిన్నమైన ప్రజల జీవితాలు గ్యారెంటీలతో ఒకింత గాడిన పడ్డాయన్నారు. గ్యారెంటీలను ఎద్దేవా చేయడం అంటే నిరుపేదలను పరిహసించడమేనని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ప్రజలు ఇలాంటి విమర్శలకు తగిన జవాబు ఇవ్వడం ఖాయమన్నారు. అనంతరం ఆయన శృంగేరికి వెళ్లి శారదా పీఠాధిపతి జగద్గురు భారతి తీర్థ మహాస్వామి ఆశీస్సులను అందుకున్నారు.


ధర్మస్థళ ధర్మాధికారి వీరేంద్ర హెగ్డేతో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

బీజేపీతోనే దళితుల ఆత్మగౌరవం

- రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర

బెంగళూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): దళితుల ఆత్మగౌరవం బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు ఆయన నగరంలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఎస్సీ, ఎస్టీ నేతలతోనూ, మండ్య జిల్లా బీజేపీ నేతలతోనూ విడివిడిగా సమావేశాలు నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన గ్యారెంటీల కోసం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు రూ. 11వేల కోట్లను దారిమళ్లించి దగా చేసిందని, ఈ విషయాన్ని దళితుల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆయన సూచించారు. లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 28 నియోజకవర్గాలను క్లీన్‌స్వీప్‌చేసే దిశలో ఎస్సీఎస్టీలు కీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర పార్టీ సంఘటనా ప్రధాన కార్యదర్శి జీవీ రాజేష్, ఉపాధ్యక్షుడు ఎన్.మహేష్, లోక్‌సభ సభ్యుడు ఉమేష్ జాదవ్, ఎమ్మెల్సీ చలవాది నారాయణస్వామి, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బంగారు హనుమంతు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సిమెంట్ మంజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండ్య జిల్లా బీజేపీ నేతలతోనూ విజయేంద్ర ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాజకీయ పొత్తు కారణంగానే మండ్యను వదులుకోవాల్సి వచ్చిందని, జేడీఎస్ అభ్యర్థికి సహకరించాలని కోరారు. మాజీ ఎంపీ ఎల్. శివరామెగౌడతో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు.


ప్రసంగిస్తున్న విజయేంద్ర

నకిలీ ఇ-బ్యాంక్ గ్యారెంటీలతో రూ.168 కోట్లకు టోకరా

- రంగంలోకి సైబర్ క్రైం పోలీసులు



బెంగళూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): బ్యాంకు రుణాల కోసం ఇచ్చే ఇ-బ్యాంకు గ్యారెంటీలకు నకిలీలు సృష్టించి రూ.168 కోట్లకు టోకరా వేసిన ఘరానా మోసగాళ్లపై బెంగళూరు సైబర్ క్రైమ్ పోలీసులు వలవేశారు. ప్రభుత్వరంగ బ్యాంకుల నుంచి రుణాలు పొందే సమయంలో ఇ-బ్యాంకు గ్యారెంటీలను ఇవ్వాల్సి ఉంటుంది. జాతీయ స్థాయిలో ఇ-గవర్నెన్స్ సర్వీస్ లిమిటెడ్ అనే ప్రభుత్వ అనుబంధ సంస్థ వీటిని పరిశీలిస్తుంది. ఆ సంస్థ ధ్రువీకరించిన తరువాతే రుణాలను మంజూరు చేస్తారు. ఈ క్రమంలో వివిధ బ్యాంకుల నుంచి రుణాలు పొందేందుకు 11 మంది వ్యక్తులు సమర్పించిన ఇ-బ్యాంకు గ్యారెంటీ లేఖలు నకిలీవని తేలడంతో ఎన్ఈఎస్ఎల్ అధికారి ఒకరు బెంగళూరు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.168.13 కోట్ల మేరకు బ్యాంకులకు టోకరా వేసినట్లు ధ్రువకరించారు. 11 మంది వ్యక్తులు రుణాలు పొందేందుకు సమర్పించిన వివిధ పత్రాలు, మొబైల్ నంబర్లు, బ్యాంకు ఖాతాలను పోలీసులు పరిశీలించారు. ఐసీఐసీఐ, సౌత్ ఇండియన్ బ్యాంకు పేరిట ఈ-బ్యాంకు గ్యారెంటీలను పొందేందుకు ఈ 11మంది దళారులకు రూ.5 కోట్ల మేరకు కమీషన్ చెల్లించినట్లు సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తులో తేలింది. నిందితులను అరెస్టు చేసేందుకు ఢిల్లీ, నోయిడా తదితర ప్రాంతాల్లో గాలింపులు చేపట్టారు. వీరిలో ఒకరు కువైట్‌లో దాక్కున్నట్లు గుర్తించారు. కేంద్ర హోంశాఖ సహకారంతో లుక్ అవుట్ నోటీసు జారీ చేయించి, కువైట్ ఇమ్మిగ్రేషన్ అధికారుల సాయంతో ఆశిష్ సక్సేనా (45) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులు బెంగళూరు నగర, గ్రామీణ తుమకూరు జిల్లాల్లో పలు బ్యాంకులను మోసగించినట్లు సైబర్ క్రైం పోలీసులు మంగళవారం వెల్లడించారు.

సూర్య, చంద్రప్రభలపై శ్రీవారు


చంద్రప్రభ వాహనంపై దర్శనమిస్తున్న నారసింహుడు



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కదిరి, మార్చి 26: శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణంలో వెలసిన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు సూర్య, చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. పగటికి అధిపతి సూర్యుడు. రేయికి రాజు చంద్రుడు. రేయింబవళ్ల కాలాధీనాలనీ, వాటితోపాటు సమస్త విశ్వానికి తానే అధిపతినని చాటి చెప్పేలా లక్ష్మీనారసింహుడు మంగళవారం సూర్యప్రభ, చంద్రప్రభలపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యపూజా హోమం అనంతరం సూర్యప్రభ వాహనంపై తిరువీధుల్లో స్వామి ఊరేగారు. సంధ్యాసమయంలో చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. విద్యుత్‌దీపాలు, రంగురంగుల పూలతో అలంకరించిన వాహనాలను అధిరోహించిన శ్రీవారిని దర్శించుకోవడానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. శ్రీవారు ఉత్సవానికి ముందుభాగంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమంలో అలరించాయి.

నేడు మోహినీ ఉత్సవం

శ్రీఖాద్రీశుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీవారు మోహినీ అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ ఉత్సవాన్ని చూడడానికి భక్తులు తండోపతండాలుగా తరలివస్తారు. స్వామివారి వెనుక భాగంలో ఉన్న వాలు జడ ఉత్సవంలో ప్రత్యేకం. కదిరి మల్లెలు ఈ ఉత్సవంలో గుభాళించనున్నాయి.


సూర్యప్రభ వాహనంపై..



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,581.48	1,590.08
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	1,743
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	911	8,523
సామర్థ్యం (టీఎంసీలు)	5.23	11.10

హంపిలో విదేశీయుల నృత్యం



దేశ విదేశీయుల హోలీ సంబరాలు

బళ్లారి సిటీ, మార్చి 26: హోలీ పౌర్ణమి సందర్భంగా చారిత్రాత్మక హంపీలో పండుగసంబరాలు తారాస్థాయికి చేరుకోగా, విదేశీయులు రంగుల ప్రవాహంలో మునిగిపోయారు. హంపీలో హోలీ పౌర్ణమి వేడుకను ప్రత్యేకంగా జరుపుకున్నారు. కామదహనం అనంతరం హోలీ సంబరాలను జరుపుకున్నారు. రాత్రంతా స్థానికులతో విదేశీయులు కూడా చేరి నృత్యాలు చేశారు. వివిధ వాయిద్యాల ట్యూన్‌కు అనుగుణంగా గుంపులుగా హోలీ సంబరాలను అస్వాదించారు.

కంప్లిలో ఘనంగా హోలీ



కంప్లిలో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు

కంప్లి, మార్చి 26 : గ్రామాల్లో పట్టణాల్లో హోలీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. కుల మత బేధాలు లేకుండా ప్రతి ఒక్కరు రంగులు చల్లుకుని తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. కంప్లిలో పలు చోట్ల యువకులు వాడవాడలా తిరుగుతూ రంగులు చల్లుకుంటూ ఆనందాన్ని వ్యక్త పరిచారు. గ్రామాల్లో కూడా చిన్నారులు బాటిళ్లలో రంగులు వేసుకుని ఒకరిపై ఒకరు చల్లుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. కంప్లితో పాటు కురుగోడు, కుడితిని ఇతర గ్రామాల్లో పూర్తిగా ఈ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

ఎఫ్‌పీఏఐ ఆసుపత్రిలో చల్లని తాగునీరు




ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వాటర్ కూలర్

బళ్లారి సిటీ, మార్చి 26: నగరంలోని ఎఫ్‌పీఏఐ ఆస్పత్రిలో కూల్ వాటర్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. ఈ వాటర్ కూలర్‌ను నగరంలోని భద్ర ఆగ్రో సర్వీసెస్‌కు చెందిన అనిల్‌కుమార్‌రెడ్డి విరాళంగా అందించారు. ఎఫ్‌పీఏ ఇండియా బళ్లారి యూనిట్ ద్వారా 50ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఈ కూల్ వాటర్ సిస్టమ్‌ని ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే పేదలకు ప్రయోజనం చేకూర్చడానికి ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు టీజీ విఠల్, ఉపాధ్యక్షుడు కమ్మ చందన, ఎఫ్‌పీఏఐ కేంద్రం ఉపాధ్యక్షులు ఎస్.విజయసింహ,ఆర్థిక సలహాదారు డా.భాగ్య, హాజరయ్యారు.

నెల్లాపురంలో వాంతులు, విరేచనాలు

కంప్లి, మార్చి 26: తాలుకా పరిధిలోని సీతారాం తండా గ్రామ పంచాయతీకి చెందిన నెల్లాపురం గ్రామంలో గత రెండు మూడు రోజులుగా వాంతులు, విరేచనాలు కేసులు ఎక్కువయ్యాయి. దీనిని గమనించిన విజయనగర జిల్లా పంచాయతీ కార్యనిర్వహణాధికారి సదాశివ ప్రభు అక్కడకు చేరుకుని ఆరోగ్య శాఖ అధికారులకు జరిగిన విషయం తెలిపి నెల్లాపురం గ్రామంలోనే ప్రాథమిక కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరు తమ ఇళ్లల్లో తాగునీరు వేడి చేసుకుని తాగాలన్నారు. అలాగే గ్రామ పంచాయతీ పీడీవో, ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా వుంటూ ప్రజలకు చికిత్స చేయాలని సూచించారు.

అంగరంగ వైభవంగా తిప్పేరుద్రస్వామి రథోత్సవం



నాయకనహట్టి గ్రామంలో మంగళవారం జరిగిన శ్రీతిప్పేరుద్ర స్వామి రథోత్సవంలో ఊరేగించిన ముక్తి బావుటా రూ.61 లక్షలు పలకడం విశేషం. స్వామి వారికి చెందిన ఈ ముక్తి బావుటాను దక్కించుకుంటే జీవితంలో శాంతి, సంపద సమృద్ధిగా సిద్ధిస్తాయని నమ్ముతారు. ఈ సారి మంత్రి డి.సుధాకర్ మరో ఐదుగురితో పోటీపడి రూ. 61లక్షలకు వేలం పాటలో దానిని సొంత చేసుకోవడం గమనార్హం.

రూ.61 లక్షలు పలికిన ముక్తి బావుటా దక్కించుకున్న మంత్రి సుధాకర్

బళ్లారి గాంధీనగర్, మార్చి 26: ఫాల్గుణ మాసంలో చిత్తా నక్షత్రం సందర్భంగా మంగళవారం చిత్రదుర్గజిల్లా నాయకనహట్టిలో తిప్పేరుద్రస్వామి బ్రహ్మరథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. లక్షలాది మంది భక్తులు బ్రహ్మరథంపై అరటిపళ్ళను విసురుతూ స్వామి వారికి మొక్కుబడులు సమర్పించుకున్నారు. కర్నాటక బుడకట్టు సముదాయాల ఆరాధ్య దైవమైన శ్రీనాయకనహట్టి శ్రీ గురుతిప్పేరుద్రస్వామి రథోత్సవం నామ జపంతో ముందుకు సాగింది. నాయకనహట్టి గ్రామంలో బ్రహ్మోత్సవ సంబరాలు తిలకించడానికి పొరుగు రాష్ట్రమైన తెలంగాణా, బళ్ళారి రాయచూరు, తుమకూరు, కొప్పళ, గదగలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన అశేష భక్త జనం తరలివచ్చారు. రథోత్సవంలో పాల్గొనే భక్తులు ఒకరోజు ముందుగానే నాయకనహట్టి గ్రామానికి చేరుకుని అక్కడే టెంట్లు వేసుకునే సాంప్రదాయం నేటికీ కొనసాగుతూనే ఉంది. స్వామి మఠం లోపల ముందు భాగంలో వెలిగించిన అగ్నిహోత్రంలో లక్షలాది మంది భక్తులు కొబ్బరి కాయలను సమర్పించడం ఇక్కడ సాంప్రదాయం.. జిల్లా పాలకమండలి బ్రహ్మోత్సవానికి విచ్చేసే భక్తులకు తాగునీటి వ్యవస్థ కల్పించినా ఆ ఏర్పాట్లు వచ్చిన భక్తులకు ఎంతమాత్రం సరిపోక పోవడంతో తాగునీటి కోసం భక్తులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

బళ్లారి మేయర్ ఎన్నిక జరిగేనా?

● లోక్‌సభ ఎన్నికల తరువాత మేయర్ ఎన్నిక నిర్వహించే యోచనలో కాంగ్రెస్ అధిష్టానం

బళ్లారి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బళ్లారి మేయర్ ఎన్నిక గురువారం నిర్వహిస్తున్నట్లు కలబురిగి రీజనల్ కమీషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడిన నేపథ్యంలో కార్పొరేటర్లకు ఈ మేరకు అధికారులు నోటీసులు ఇచ్చారు. కాని లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అసలు బళ్లారి మేయర్ ఎన్నిక



జరుతుందా..? లేదా అనే అనుమానాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఎంపీ ఎన్నిక ముందు మేయర్ ఎన్నిక తలనొప్పి ఎందుకు? వాయిదా వేస్తే పోలేదా? అనే ఆలోచనలో కాంగ్రెస్ అధిష్టానం ఉన్నట్టు తెలుస్తోంది. మేయర్ ఎన్నిక జరగాలంటే ఎమ్మెల్యే భరత్‌రెడ్డి, బళ్లారి జిల్లా ఇన్‌చార్జి మంత్రి బి. నాగేంద్ర, అలాగే ఎంపీల మధ్య ఏకాభిప్రాయం అవసరం. మేయర్ పదవిని కాంగ్రెస్ పార్టీలో నలుగురు ఆశిస్తున్నారు. 18వ వార్డు కార్పొరేటర్ ముల్లంగి నందీష్ బాబు, 3వవార్డు కార్పొరేటర్ ముండ్లూరు ప్రభంజన్ కుమార్ గట్టిగా ఇందుకోసం పోటీ పడుతున్నారు. ఇక గాదెప్ప, పి. విక్కీ కూడా రేసులో ఉన్నామంటున్నారు. ముల్లంగి నందీష్ బాబును మేయర్ చేయాలని ఒక వర్గం గట్టిగా పట్టుదలతో ఉండగా, ముండ్లూరు ప్రభంజన్ కూడా మేయర్ కుర్చీ కోసం పట్టుదలగా ఉన్నట్టు తెలుస్తోంది.

వాస్తవానికి మేయర్ ఎంపిక విషయంలో మంత్రి బి నాగేంద్రకు, ఎమ్మెల్యే భరత్‌రెడ్డికి సమన్వయం లేదని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నా, ఎమ్మెల్యే భరత్‌రెడ్డి మాత్రం ముండ్లూరు ప్రభంజన్ కుమార్‌కు మద్దతునిస్తున్నారని తెలుస్తోంది.

కార్పొరేటర్లకు తాయిలాలు

మేయర్ పదవి ఆశిస్తున్న నందీష్‌బాబు మంగళవారం కొందరి కార్పొరేటర్లకు తాయిలాలు ఇచ్చినట్లు సామాజిక మాధ్యమాల్లో వార్తలు హల్ చల్ చేశాయి. 50 గ్రాముల స్వర్ణం, ఒక వెండి పల్లెం, సుమారు, రూ. 75 వేల విలువ చేసే తాయిలాలను కొందరు కార్పొరేటర్లకు ఇచ్చారని సమాచారం. అయితే కొందరు కార్పొరేటర్లు నందీష్‌బాబు తాయిలాలు స్వీకరించలేదని తెలుస్తోంది.

బళ్లారి మేయర్ ఎన్నికలో బీజేపీ కార్పొరేటర్ల పాత్ర ఏమిటనే దానిపై కూడా చర్చలు సాగుతున్నాయి. బీజేపీ కార్పొరేటర్లు ప్రస్తుతం మేయర్ పదవికి పోటీ పడుతున్న కార్పొరేటర్లలో ఒకరికి మద్దతు ఇస్తారా..? లేక తామే పోటీచేస్తారా? అనే విషయం కీలకంగా మారింది.

ఇంత కాలం గాలి జనార్దన్‌రెడ్డి పార్టీ కేఆర్‌పీపీ రంగంలో ఉండేది. కేఆర్‌పీపీలో కొందరు నందీష్‌బాబుకు మద్దతు ఇచ్చే అవకాశం ఉండేది. మరి ఇప్పుడు రాజకీయం మారింది. జనార్దన్‌రెడ్డి బీజేపీలో చేరారు. శ్రీరాములు, గాలి జనార్దన్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి కలిసి ఏ ఎత్తులు వేస్తారో అనేది ఆసక్తికరంగా మారింది.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి బలం ఉండే ఏకైక నగర పాలికే బళ్లారి ఒక్కటే.. రాష్ట్రంలో ఉండే నగర పాలికల్లో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు ఎక్కువగా గెలిచింది బళ్లారిలో మాత్రమే. మిగిలినవన్నీ బీజేపీ పాలనలోనే కొనసాగుతున్నాయి. మొత్తంమీద కాంగ్రెస్‌లో ఉండే విభేదాలను బీజేపీ ఎలా సద్వినియోగం చేసుకుంటుందనే విషయంపై చర్చలు జరుగుతున్నాయి.

క్రమపద్ధతిలో పోస్టల్ బ్యాలెట్ పేపర్ల పంపిణీ : డీసీ ప్రశాంత్‌కుమార్

బళ్లారి సిటీ, మార్చి 26: లోక్‌సభ ఎన్నికల కోసం జిల్లాలో నిత్యావసర సర్వీసుల కింద పనిచేస్తున్న వివిధ కేంద్ర, రాష్ట్ర శాఖల అధికారులు సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ పత్రాల పంపిణీని చాలా క్రమపద్ధతిలో నిర్వహించాలని జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ఆదేశించారు. మంగళవారం జిల్లాకలెక్టర్ కార్యాలయంలోని కేస్వాన్ వీడియో హాల్లో పోస్టల్ బ్యాలెట్ పేపర్ల పంపిణీపై ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే సదుపాయం ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే ఉద్యోగులందరికి అందుబాటులో ఉంటుందన్నారు. అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సమావేశంలో నోడల్ అధికారి చంద్రశేఖర్, మౌనేశ్, కేంద్ర, రాష్ట్ర వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి

కంప్లి, మార్చి 26 : ఎన్నికల్లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఆరోగ్యశాఖ అధికారి రమేష్‌బాబు తెలిపారు. కంప్లి పట్టణంలో ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ అవగాహన జాతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇప్పటికే జిల్లాలోని పలు సముదాయ ఆస్పత్రుల్లో ఓటు హక్కు జాగృతి కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాలుకా అధికారి జీ అరుణ్, రవీంద్ర కనికేరి, ఈశ్వర్, దానప్ప, డాక్టర్లు వీరేష్ పాల్గొన్నారు.

మంత్రి శివరాజ తంగడిపై కేసు నమోదు

బళ్లారి గాంధీనగర్, మార్చి 26: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కొప్పళ లోకసభ నియోజకవర్గ అభ్యర్థి కె.రాజశేఖర్ హిట్నాళ్ కోసం ప్రచారం చేసే సందర్భంగా ప్రధానిపై యువతను రెచ్చగొట్టే రీతిలో ప్రసంగించినందుకు రాష్ట్ర కన్నడ సంస్కృతి శాఖా మంత్రి శివరాజ్ తంగడిపై కారటిగి పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. శివరాజ్ తంగడిగి తన ప్రసంగంలో యువతను రెచ్చగొట్టే విధంగా మాట్లాడారని, అయనపై చట్టరీత్యా చర్యలు చేపట్టాలని కారటిగి ఎన్నికల అధికారి, గంగావతి తాలూకా ఎస్సీవర్గాల సంక్షేమ శాఖ అధికారి గ్యామనగౌడ నందనగౌడ ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కేసు నమోదు చేశారు.

కనులపండువగా అమరేశ్వరస్వామి రథోత్సవం



బళ్లారిరూరల్, మార్చి 26 : తాలుకాలోని సిరివరం గ్రామంలో అమరేశ్వర మహా రథోత్సవాన్ని సోమవారం సాయంత్రం కన్నుల పండువగా జరుపుకున్నారు. ఈ జాతర సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తాదులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. సాయంత్రం ఆలయం వద్ద నుంచి అశేష భక్తజనసందోహం అమరేశ్వరస్వామి వారి రథాన్ని లాగారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుండి పెద్దఎత్తున భక్తాదులు స్వామివారి పూజల్లో పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించండి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ కొప్పాళ ఎంపీ అభ్యర్థి బసవరాజు

సిరుగుప్ప, మార్చి 26 : దేశ ప్రధాని నరేంద్రమోడీ చేసిన పనులను పరిగణలోకి తీసుకుని బీజేపీ పార్టీకి ఓటు వేయాలని కొప్పాళ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి డాక్టర్ బసవరాజు.. ప్రజలను కోరారు. సిరుగుప్ప పట్టణం లక్ష్మీవెంకటేశ్వర కల్యాణమండపంలో బీజేపీ, జేడీఎస్ కార్యకర్తల ఆధ్వర్యంలో బూత్ అభియాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కొప్పాళ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బసవరాజు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. జేడీఎస్ జిల్లా అధ్యక్షులు మీనళ్లి తాయణ్ణ మాట్లాడుతూ బీజేపీ గెలుపుకు జేడీఎస్ పార్టీ నుంచి పూర్తి మద్దతు వుంటుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీమంత్రి నాగప్ప, మాజీఎంపీ విరుపాక్షప్ప, మాజీ ఎమ్మెల్యేలు బసవరాజు, ప్రతాప్‌గౌడ పాటిల్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

సిరుగుప్ప, మార్చి 26 :వేసవికాలంలో ప్రజలు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటుచేసినట్లు డీఎస్పీ వెంకటేష్ తెలిపారు. మంగళవారం సిరుగుప్ప పట్టణం బీఎస్పీ కార్యాలయ ఆవరణం ముందు చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసులు కాశీనాథ్, వార్డెన్లు, పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభించిన డీఎస్పీ

వైభవంగా ఆంజనేయస్వామి రథోత్సవం



భక్తజనసందోహం నడుమ సాగుతున్న ఆంజనేయస్వామి రథోత్సవం

కంప్లి, మార్చి 26 : మరెమ్మనహళ్లి తాలుకా జిలకనట్టి సమీపంలోని హరవనహళ్లి ఆంజనేయస్వామి రథోత్సవం (మార్గదయ్యస్వామి) మంగళవారం వైభవంగా జరిగింది. ప్రతి యేటా పౌర్ణమి అనంతరం గ్రామంలో ఆంజనేయస్వామి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పదాధికారులు, ప్రముఖులు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామివారికి వివిధ విశేష పూజలు చేపట్టారు. చుట్టుపక్కల గ్రామాల భక్తాదులకు పాదయాత్రగా చేరుకుని మార్గదయ్య స్వామికి పూలు, పండ్లతో మొక్కులు సమర్పించుకున్నారు. సాయంత్రం వేలాది మంది భక్తాదుల నడుమ రథోత్సవాన్ని నిర్వహించారు.

హోసూరు జోన్

సరిహద్దుల్లో ముమ్మర తనిఖీలు



హోసూరు మార్చి 26: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దు సహా రాష్ట్ర సరిహద్దులోనూ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేశారు. సరిహద్దులోని అత్తిబెలె వద్ద ఫ్లయింగ్ ట్రూపర్ బృందాలు తనిఖీలు చేస్తున్నాయి. ఇక్కడ తనిఖీలు చేశాకనే వాహనాలను తమిళనాడులోకి అనుమతిస్తున్నారు. అత్తిబెలె సరిహద్దులో బెంగళూరు రూరల్ జిల్లా ఎస్పీ మల్లికార్జున బాలదండి సందర్శించారు. అత్తిబెలె పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాఘవ్ ఎస్ గౌడ, ఏఎస్పీ శివకుమార్, అరుణ్‌కుమార్ తదితరులు ఉన్నారు. తనిఖీలకు సంబంధించి వీడియో రికార్డింగ్ చేస్తున్నారు.

లక్షలాది విలువైన వస్తువులు దగ్ధం

హోసూరు(క్రైం) మార్చి 26: హోసూరు సమీపంలోని తొరపల్లి గ్రామంలో రాయకోట రాష్ట్ర రహదారిపై హోసూరుకు చెందిన శివకుమార్‌కు చెందిన పాత వస్తువుల గోడౌన్‌లో మంగళవారం ఆకస్మికంగా అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఆ ప్రాంతంలో మరోచోట చెలరేగిన మంటలు నెమ్మదిగా వ్యాపించి గోడౌన్‌లోని పాత వస్తువులు దగ్ధమయ్యాయి. పురాతన భవనాల్లో మంటలు చెలరేగడంతో ఆకాశంలో పొగలు కమ్ముకున్నాయి. స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని, ఫైరింజన్లతో మంటలను నియంత్రించారు.

వందశాతం పోలింగ్‌కు కృషి

హోసూరు(కృష్ణగిరి), మార్చి 26: లోక్‌సభ ఎన్నికల్లో వందశాతం పోలింగ్ లక్ష్యంగా హోసూరు కార్పొరేషన్ పరిధిలో అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారిగా ఉన్న కలెక్టర్ సరయు స్వయంగా పాల్గొని అవగాహన కల్పించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఏ సాధనకురళ్, హోసూరు కార్పొరేషన్ కమిషనర్ టి స్నేహా, వ్యవసాయ సంయుక్త సంచాలకులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు. కెలమంగలం రైతు బజారులో ఓటింగ్ గురించి అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు కళాజాతా పేరిట అవగాహన కల్పించారు. శూలగిరిలోని డి-మార్ట్ స్టోర్‌లో షాపింగ్ చేసే ప్రజలకు కూడా జాగృతి కల్పించారు. కృష్ణగిరి కొత్త బస్టాండ్ వద్ద పార్లమెంట్ ఎన్నికల్లో వంద శాతం ఓటింగ్‌కు కలెక్టర్ ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు పచ్చయప్పన్ తదితరులు పాల్గొన్నారు. హోసూరు మరగతాంబ చంద్రచూడేశ్వర ఆలయ సమీపాన బెలూన్‌లు ఎగురవేసి వందశాతం ఓట్లు వేయాలని అవగాహన కల్పించారు.



ఎన్నికలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

టెన్త్ పరీక్షలకు 30,228 మంది హాజరు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

రాయచూరు, మార్చి 26 : జిల్లాలో 93 కేంద్రాల్లో నిర్వహిస్తున్న టెన్త్ పరీక్షకు మంగళవారం మొత్తం 30228 మంది హాజరయ్యారు. జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశామని విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం జరగకుండా పరీక్షల నిర్వహణ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఏ కేంద్రంలోను మాస్ కాపీ, డిబార్ వంటి సంఘటనలు చోటు చేసుకోలేదని, 871 మంది గైర్హాజరైయ్యారన్నారు.

కుమార్ నాయక్‌ను కలిసిన మహిళా కాంగ్రెస్ నేతలు

రాయచూరు, మార్చి 26 : లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రాయచూరు స్థానం నుంచి పోటీ చేస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జీ కుమార్ నాయక్‌ను మంగళవారం జిల్లాకు చెందిన మహిళా కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. రాయచూరు అభ్యర్థిగా నియమితులైన కుమార్ నాయక్‌కు పార్టీ పరంగా స్వాగతం చెబుతున్నట్లు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శశికళ భీమరాయ తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీల వల్ల ప్రజల్లో పార్టీ పట్ల మరింత విశ్వాసం పెరిగిందన్నారు. అదే సమయంలో మహిళలు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పరంగా పూర్తి సానుకూలంగా ఉన్నారని ఎన్నికల్లో పార్టీ గెలుపు ఖాయమని వారు కుమార్ నాయక్‌కు వివరించారు.



కుమార్ నాయక్‌ను సన్మానిస్తున్న మహిళలు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంబ్...

స్వామి విపులానంద (జయంతి)



స్వామి విపులానంద 1892 మార్చి 27న శ్రీలంకలో జన్మించారు. విపులానంద అడిగల్‌గా పేరొందారు. తమిళ హిందూ సంఘ సంస్కర్త. సాహితీవేత్త, కవి, ఉపాధ్యాయుడిగా రాణించారు. రామ క్రిష్ణ మిషన్‌తో కలసి ముందుకు సాగారు. తమిళం తో పాటు ఆంగ్లం, గ్రీకు, లాటిన్, సంస్కృతం, సింహళ భాషలలో నిపుణులు. షేక్‌స్పియర్ రచించిన 12 నాట కాలను అనువదించారు. శ్రీలంకలో ఆయన పేరిట ఎన్నో ఇన్‌స్టిట్యూషన్స్ ఉన్నాయి. భక్తి, సంగీత పుస్త కాలు రచించారు. 1947 జూలై 19న కన్నుమూశారు. ఆయన గౌరవార్థం శ్రీలంక, జర్మనీలలో పోస్టల్‌స్టాంప్ విడుదల చేశారు.

అన్నవరపు రామస్వామి (పుట్టినరోజు)



పద్మశ్రీ గ్రహీత అన్నవరపు రామస్వామి 1926 మార్చి 27న పశ్చిమగోదావరి జిల్లా సోమవరప్పాడు ప్రాంతంలో జన్మించారు. వయోలిన్ విద్వాంసులు. ప్రత్యేకించి కర్ణాటక సంగీతంలో రాణించారు. 1948 నుంచి 1986 వరకు ఆకాశవాణిలో సేవలందించారు. సహకార వాద్యుడిగానే కాక స్వతంత్రంగా కూడా కచేరీలు నిర్వహించారు. సంగీత నాటక అకాడమీ అవార్డు, కళారత్న అవార్డు ఇతర గౌరవాలు అందుకున్నారు.

రామ్‌చరణ్ తేజ్ (పుట్టినరోజు)



మెగాస్టార్ చిరంజీవి కుమారుడు కొణిదెల రామ్‌చరణ్ తేజ్ 1985 మార్చి 27న జన్మించారు. తెలుగు సినీరంగంలో అత్యధిక రెమ్యునరేషన్ అందుకుంటున్న నటులలో ఒకరు. సొంతంగా ప్రొడక్షన్ కంపెనీని ఏర్పాటు చేశారు. 2013లో ఫోర్బ్స్ టాప్ 100 ఇండియన్ సెలిబ్రిటీస్‌లో చోటు దక్కించుకున్నారు. చిరుత, మగధీర, రంగస్థలం సినిమాలు ఎంతో గుర్తింపు తెచ్చాయి. రెండు నంది అవార్డులు, మూడు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు అందుకున్నారు. అభిమానులు 'చెర్రీ' అని పిలుస్తారు. మెగా పవర్‌స్టార్‌గా గుర్తింపు పొందారు.

వైభవంగా కైవార తాతయ్య రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

చింతామణి రూరల్, మార్చి 26: తాలూకాలోని కైవారలో కాలజ్ఞాని, సద్గురు యోగి నారేయణ తాతయ్య రథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. సద్గురు మూల విరాట్టుకు తొలుత విశేషపూజల అనంతరం ఉత్సవమూర్తికి అభిషేకం, అష్టావధాన సేవ నిర్వహించారు. పూజా కైంకర్యాలలో ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ దంపతులు పాల్గొన్నారు. అనంతరం అలంకరించిన పల్లకీలో మంగళవాయిద్యాల నడుమ కైవార తాతయ్య ఉత్సవమూర్తిని రథంపై కొలువుదీర్చారు. రథోత్సవంలో వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రథం పై అరటిపండ్లు వేసి మొక్కులు తీర్చు కున్నారు. తాలూకానుంచే కాక సరి హద్దులోని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రాంతాలనుంచి కూడా భక్తులు వచ్చారు. గ్రామాలనుంచి వచ్చిన కొంతమంది ట్రాక్టర్లలో మజ్జిగ, పానకం పంపిణీ చేశారు. కాగా నాదసుధారస వేదికపై ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగాయి. రాత్రి విశ్వగురు బసవణ్ణ కన్నడ కళాసంఘం నరసాపుర ఆధ్వర్యంలో 'శ్రీకృష్ణసంధాన' అనే పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు. మరోవైపు రాత్రి ఉత్సవంలో యోగి నారేయణ తాతయ్య పల్లకీ ఉత్సవం భక్తిశ్రద్ధలతో సాగింది.

ఘనంగా కైవార తాతయ్య జయంతి

శిడ్లఘట్ట, మార్చి 26: స్థానిక బలిజసంఘం ఆధ్వర్యంలో కైవార తాతయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని యోగినారేయణ యతీంద్రనగర్‌లో నెలకొన్న వీరాంజనేయస్వామి ఆలయం ఆవరణలోని తాతయ్యకు మంగళవారం విశేషపూజలు నిర్వహించారు. వీరాంజనేయ స్వామికి కూడా పూజలు జరిపారు. తాతయ్య కీర్తనలు, భజనలు ఆలపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. స్థానిక ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎస్ శంకర్, గౌరవాధ్యక్షుడు సోమశేఖర్, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, సభ్యులు అనంతపద్మనాభం, అబ్లూడు దేవరాజ్, గేట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కైవారతాతయ్య ఉత్సవమూర్తి ఊరేగింపు



యోగి నారేయణతాతయ్య మూల విరాట్టుకు అలంకరణ

లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం



మిట్టేమరి పురవీధులలో రథోత్సవం

బాగేపల్లి, మార్చి 26: తాలూకాలోని మిట్టేమరి గ్రామంలో పురాణ ప్రసిద్ధి చెందిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఉత్సవాల్లో బ్రహ్మరథోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం స్వామివారి మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం, హోమాలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు గంధోత్సవం నిర్వహించారు. తదుపరి రథంపై కొలువు దీర్చారు. తహసీల్దారు ప్రశాంత్ కే పాటిల్ రథోత్సవానికి ప్రారంభించారు. కదిరి నుంచి గరుడపక్షి వచ్చి రథోత్సవానికి సూచిక ఇచ్చాకనే నిర్వహించడం ఇక్కడి ప్రత్యేకత. విష్ణువాహనమైన గరుడపక్షిని చూస్తే పునర్జన్మ ఉండదని భక్తుల ప్రగాఢ నమ్మకం. గరుడపక్షి వచ్చి రథంపై ప్రదక్షిణ చేశాకనే బ్రహ్మ రథోత్సవాన్ని ఆరంభిస్తారు. ఆకాశంలోనే గరుడపక్షి మూడుసార్లు ప్రదక్షిణ చేసి కనుమరుగైంది. అనంతరం భక్తుల హర్షధ్వానాల మధ్య రథోత్సవం సాగింది. మంగళవాయిద్యాలు, డప్పువాద్య కళాబృందాలు రథోత్సవానికి శోభ తెచ్చాయి. వేసవి కావడంతో ఇంటింటా, ప్రధాన కూడళ్లలోనూ మజ్జిగ, పానకం భక్తులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే సుబ్బారెడ్డి శాస్త్రోక్తంగా రథానికి పూజలు చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. తాలూకానుంచే కాక సరిహద్దు ప్రాంతాలనుంచి కూడా భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ నేతృత్వంలో అన్నదాసోహం నిర్వహించారు. ఎటు చూసినా సందడి నెలకొంది. ఈ సందర్భంగా జడ్పీ మాజీ సభ్యుడు బూరగమడుగు లక్ష్మీనరసింహప్ప, పీ మం జునాథ్‌రెడ్డి, రెవెన్యూశాఖ సిబ్బంది ప్రీతమ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు బిల్లులకు ఎట్టకేలకు గవర్నర్ ఆమోద ముద్ర

బెంగళూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): శాసనసభ సమావేశాల్లో ఆమోదం పొందినా కేబినెట్ అనుమతి లభించకపోవడంతో కొద్దికాలంగా పెండింగ్‌లో ఉంచిన ఆరు బిల్లులకు గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ ఎట్టకేలకు ఆమోద ముద్ర వేశారు. బెళగావి శాసనసభ సమావేశాల్లో ఆమోదం పొందిన నాలుగు బిల్లులు, ఇటీవలి బడ్జెట్ సమావేశాల్లో ఆమోదం పొందిన రెండు బిల్లులపై గవర్నర్ సంతకం చేయకుండా తనవద్దే ఉంచేసుకున్నారు. ఈ బిల్లులకు కేబినెట్ ఆమోదం లభించకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. ఈ విషయంలో ప్రభుత్వ తీరుపై ఆయన ఒకింత అసంతృప్తి కూడా వ్యక్తం చేశారు. ఇకపై ఇలా జరుగకుండా చూస్తామని స్వయంగా ముఖ్యమంత్రి సిద్దరామయ్య హామీ ఇవ్వడంతో గవర్నర్ శాంతించారు. గవర్నర్ తాజాగా సంతకం చేసిన బిల్లుల్లో కర్ణాటక న్యాయవాదులపై దౌర్జన్యాల నిషేధం బిల్లు, కర్ణాటక హైకోర్టు సవరణ బిల్లు, కర్ణాటక సివిల్ కోర్టుల సవరణ బిల్లు, కర్ణాటక పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్‌లలో పారదర్శకత బిల్లు, కర్ణాటక స్టాంపుల సవరణ బిల్లు, కర్ణాటక భూ రెవిన్యూ సవరణ బిల్లు ఉన్నాయి. ప్రభుత్వానికి రాజ్‌భవన్‌కు మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగిన పిమ్మటే ఈ బిల్లులపై గవర్నర్ సంతకం పెట్టడం గమనార్హం.

సమాజసేవకుడు అయ్యలరాజుకు ఘన సన్మానం



సన్మానిస్తున్న కనుమూరి బాపిరాజు తదితరులు

బెంగళూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సమాజసేవకుడు అయ్యలరాజును నగరంలో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో ప్రముఖ కాంగ్రెస్ నేత కనుమూరి బాపిరాజు, అన్నపూర్ణమ్మ దంపతులు ఘనంగా సన్మానించారు. బెంగళూరు నగరంలో చేస్తున్న సేవలను గుర్తించి ఆయనను సన్మానించినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నగర తెలుగు ప్రముఖులు కే గంగరాజు, గిరిరాజు తదితరులు హాజరయ్యారు.

రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అనువైన వాతావరణం

బెంగళూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): దక్షిణాదిన కర్ణాటకలో పరిశ్రమల స్థాపనకు ఎంతో అనువైన వాతావరణం నెలకొని ఉందని వాల్గో ఇన్‌ఫ్రా సీఈఓ శ్రీధర్‌రావ్ పేర్కొన్నారు. మల్లేశ్వరంలోని శ్రీధర్‌రావ్ నివాసంలో జరిగిన వేడు కకు శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ టెలి కమ్యూనికేషన్ రంగంలో తమ సంస్థ అగ్రగామిగా ఉందని తెలంగాణతో సహా ఐదు రాష్ట్రాల్లో కార్యకలాపాలను విస్తరించుకుందని చెప్పారు. కేవలం పారిశ్రామిక రంగానికే పరిమితం కాకుండా పలు సామాజిక సేవా కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. ఇటీవల దావోస్‌లో జరిగిన విశ్వ ఆర్థిక శిఖరాగ్ర సభకు హాజరై సొంత రాష్ట్రం తెలంగాణతో పాటు కర్ణాటకలోనూ పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నం చేశానన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలను కల్పించే దిశలో శక్తివంచన లేకుండా పాటుపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎంబీ పాటిల్, మధు బంగారప్ప, కేపీసీసీ కార్యాధ్యక్షుడు సలీం అహ్మద్, ఎమ్మెల్యే గణగ రవి తదితరులు హాజరయ్యారు. ఈ మేరకు సంస్థ నగరంలో మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది.



హాజరైన శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్, డీసీఎం డీకే శివకుమార్ తదితరులు

7న జిల్లాస్థాయి ఎద్దులబండ్ల పోటీలు

గోరంట్ల, మార్చి 26: శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని కరావులపల్లి తండా ఆంజనేయస్వామి ఆలయం వద్ద జిల్లాస్థాయి ఎండ్లబండ్లపోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు శంకర్‌లాల్‌నాయక్ తెలిపారు. ఏప్రిల్ 17న ఎడ్లబండ్లపోటీలు నిర్వహిస్తున్నట్లు, ఆలయం వద్ద మంగళవారం జరిగిన సమావేశంలో పేర్కొన్నారు. దశాబ్ద కాలంగా ప్రతియేటా శ్రీరామనవమికి వినోద కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. జిల్లాస్థాయి ఎడ్లబండ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.60వేలు, రెండో బహుమతి రూ.50వేలు, మూడో బహుమతి రూ.40వేలు, నాల్గోవ బహుమతి రూ.30వేలు, ఐదో బహుమతి రూ.20వేలు నగదు అందిస్తా మన్నారు. ఆసక్తిగల రైతులు సెల్ ఫోన్ నంబర్లు 9912187783, 9000895664 కు సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో గంపల రమణారెడ్డి, పాలే జయరాంనాయక్, రామచంద్రారెడ్డి, శివారెడ్డి, ముసలిరెడ్డి, వాసునాయక్, రాజేష్‌నాయక్, బీలునాయక్, బాబునాయక్ తదితరులున్నారు.

'మోడల్‌స్కూల్‌లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి'

ధర్మవరంరూరల్, మార్చి 26: ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం ప్రవేశాలు కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ధర్మవరం ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పద్మశ్రీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఉచిత విద్యతోపాటు ఇంగ్లీష్‌లో బోధన ఉంటుందన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదోతరగతి మార్కుల మెరిట్ ద్వారా రిజిస్ట్రేషన్ రూల్స్ ప్రకారం ప్రవేశాలు ఉంటాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150లు, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.200లు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 28వ తేదీ నుంచి మే 22లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కోడ్ ఉల్లంఘనలపై కొరడా

అనంతపురం టౌన్, మార్చి 26: ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై జిల్లా కలెక్టరు కొరడా ఝులిపిస్తున్నారు. మొదట్లో కొంత చూసీచూడనట్లు అధికారుల వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతూ వచ్చాయి. దీనిపై ఆంధ్రజ్యోతిలోనూ ప్రత్యేక కథనాలు ప్రచురించ డం జరిగింది. అప్పటినుంచి కలెక్టరు గౌతమి కోడ్ ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. రాజకీయ పార్టీల కార్యక్రమాలు, ప్రచారాల్లో పాల్గొంటున్న వలంటీర్లు, డీలర్లు, సచివాలయ సిబ్బంది, ఐకేపీ సిబ్బందిపై చర్యలు చేపడుతూ వస్తున్నారు. ఇందు కు సంబంధించి మంగళవారం కలెక్టరు వివరాలు వెల్లడించారు. ఇప్పటి వరకు 36మంది వలంటీర్లపై చర్యలు తీసుకున్నట్లు కలెక్టరు తెలిపారు. మంగళవారం కూడా గుంతకల్ నియోజకవర్గంలో ఆరుగురు వలంటీర్లు, రాయదుర్గం నియోజకవర్గంలో 9మంది వలంటీర్లపై చర్యలు వేటు వేసినట్లు ఆమె వెల్లడించారు. వీరితో పాటు ఇతరశాఖలకు చెందిన మరో 16 మందిపైనా చర్యలు తీసుకున్నామనీ, ఇందులో డీలర్లు ఐదుగురు, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఏడుగురు, రెగ్యులర్ ఉద్యోగి ఒకరిపై చర్యలు తీసుకున్నట్లు కలెక్టరు తెలిపారు. ఇందులో కూడా మంగళవారం ముగ్గురు కాంట్రాక్ట్ ఉద్యోగులపై వేటు వేసినట్లు తెలిపారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఉన్న 7,025 పోస్టర్లు, 3,312 బ్యానర్లు, 812 గోడలపై రాతలు తొలగించామన్నారు. ఇప్పటివరకు సీవిజిల్ యాప్‌ద్వారా 191 ఫిర్యాదులు వచ్చాయనీ, పరిశీలించి చర్యలు తీసుకున్నామని కలెక్టరు గౌతమి తెలిపారు.

రూ. 2.20 లక్షల నగదు పట్టివేత

రాయదుర్గం రూరల్, మార్చి 26: పట్టణ సమీపంలోని గాలిమారమ్మ గుడి చెక్‌పోస్టు వద్ద గణాంక నిఘా బృందం అధికారులు వాహలను తనిఖీ చేస్తుండగా రూ. 2.20 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తహశీల్దార్ చిట్టిబాబు తెలిపారు. మంగళవారం చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీల్లో భాగంగా బస్సులు తనిఖీ చేయగా బెళుగుప్ప మండలం అంకంపల్లి గ్రామానికి చెందిన రైతు సా యికుమార్ రూ. 2.20 లక్షలు నగదును స్వాధీనం చేసి సీజ్ చేసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఈ నగదును అనంతపురం జిల్లా అధికారులకు చేరవేస్తున్నట్లు తెలిపారు.

అధికారులపై చర్యలు తీసుకోండి



వినతి పత్రం సమర్పిస్తున్న రైతుసంఘం సభ్యులు

బంగారపేట, మార్చి 26: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తాలూకా నాలుగు వైపులా చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేశారని, గత వారం సుమారు రూ.4.20 లక్షల విలువైన బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నారని, అయితే ఇందుకు సంబంధించి పౌర ఆహార సరఫరాలశాఖ అధిరులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడాన్ని రైతు సంఘం తప్పుబట్టింది. రైతుసంఘం, హసిరుసేన సంఘాల ప్రముఖులు మంగళవారం నిరసన తెలిపి తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. అనంతరం రైతుసంఘం నాయకులు టీఎన్ రామేగౌడ మాట్లాడుతూ భారీ ప్రమాణంలో బియ్యం బస్తాల అక్రమ రవాణా సాగుతోందంటే పౌర ఆహార సరఫరాలశాఖ అధికారుల కుమ్మక్కుతోనే సాధ్యమని ఆరోపించారు. అక్రమాలకు అవకాశం లేకుండా అటువంటి అధికారులపై తొలుత చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కోలారునుంచి వస్తున్న వాహనాలను తనిఖీ చేయగా రెండు టెంపోలలో బియ్యం బస్తాలను అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారన్నారు. కేవలం సీజ్ చేస్తే చాలదని, నిందితులకు కఠిన శిక్ష విధించాలని, అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని, ఇందుకు పరోక్షంగా సహకరించే అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు మురళి, కదిరేనహళ్ళి రమేశ్, దేవరాజప్ప, లక్ష్మమ్మ, మోహన్, తమ్మణ్ణ, మునిస్వామప్ప, వెంకటేశ్, శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

మావనహక్కుల ఉల్లంఘనలను తీవ్రంగా పరిగణించాలి

బెంగళూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మానవ హక్కులకు ఏ రూపంలో ఉల్లం ఘన జరిగినా తీవ్రంగా పరిగణించాలని కన్నడ చళువళి కేంద్ర సమితి అధ్యక్షుడు గురుదేవ్ నారా యణకుమార్ అభిప్రాయపడ్డారు. నగరంలో మం గళవారం ఆయన రాష్ట్ర మానవహక్కుల కమీషన్ అధ్యక్షుడు డా.టి.శ్యామ్‌భట్‌ను తమ సంస్థ తరు పున ఘనంగా సన్మానించారు. మాన వ హక్కుల ఉల్లంఘన సమస్త మానవాళికి మాయని మచ్చగా మిగిలిపోతుందన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులు అన్ని వర్గాల ప్రజలకు అందేలా చూడాల్సిన బాధ్యత కూడా తమపై ఉందని ఈ విషయంలో చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని డా.భట్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.



డాక్టర్ టి.శ్యామ్‌భట్‌ను సన్మానిస్తున్న గురుదేవ్

ఘనంగా ద్రౌపది ధర్మరాయ కరగ ఉత్సవం

బొమ్మనహళ్ళి, మార్చి 26: నియోజకవర్గంలోని బిళేకహళ్ళిలో ద్రౌపదీ సమేత ధర్మరాయ స్వామి కరగ ఉత్సవం సోమవారం ఘనంగా జరిగింది. కరగ ఊరేగింపు స్థానిక బిళేకహళ్ళి నుంచి విజయబ్యాంకు లే అవుట్, అనుగ్రహ లే అవుట్, తాయప్ప గార్డెన్ తదితర ప్రాంతాలలో సంచరించింది. అర్చకులు, బ్రాహ్మణుల ఇళ్లముందు రంగురంగుల రంగవల్లులతో కరగశక్తికి ప్రత్యేక స్వాగతం పలికారు. ఊరేగింపు సాగే ప్రదేశాలను అందంగా ముస్తాబు చేశారు. ద్రౌపదీ సమేత ధర్మరాయస్వామి దేవాలయంలో 21 ఏళ్లుగా హోళి పున్నమి రోజున కరగ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇటీవల పీ వెంకటేశ్ కన్నుమూయడంతో స్థానిక గురువు ఏ శ్రీనివాసమూర్తి 9సార్లు కరగను ధరించారు. ఈ ఏడాది పూజారి బీకే గిరీశ్ రెండోసారి కరగతో ఊరేగడం విశేషం. కరగ ఉత్సవం నేపథ్యంలో 50కుపైగా ఆలయాలనుంచి విద్యు ద్దీపాలతో రథాలలో ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఉత్సవాల్లో ఎంపీ తేజస్వి సూర్య, బొమ్మనహళ్ళి ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



ద్రౌపదీసమేత ధర్మరాయస్వామికి అలంకరణ, కరగధారి ఊరేగింపు

ఘనంగా తిరుమలపుర రథోత్సవం

చేళూరు, మార్చి 26: తాలూకాలోని బురుడు గుంట గ్రామపంచాయతీ పరిధిలోని తిరుమల పుర గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. శ్రీదేవి భూదేవి సమేత స్వామివార్లకు విశేషపూజల అనంతరం ఉత్సవర్లను రథంపై కొలువుదీర్చారు. చిలకలనేర్పు, చేళూరు, ఏనిగదళ తదితర గ్రామాలకు చెందిన ప్రజలు రథోత్సవంలో పాల్గొన్నారు. ప్రత్యేకించి అఖండ రామభజన ఆకట్టుకుంది. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.



పురవీధులలో రథోత్సవం

ఎగుమతి లేక ధర తగ్గిన 'ఉల్లి'

చేళూరు, మార్చి 26: చేళూరు తాలూకాలో ప్రత్యేకించి ఎగుమతి రకం ఉల్లి సాగు ఎక్కువగా ఉంది. 50కేజీల బస్తా ఉల్లి ఇదివరకు రూ.2.500 ఉండేది. రెండు రోజులుగా రూ.2వేలలోపే ఉంది. ఎన్నికల కోడ్ ప్రభావంతో ఇతర దేశాలకు ఎగుమతి సాధ్యం కావకపోవడంతో ఆశించిన మేరకు ధర లభించడం లేదని పలువురు రైతులు అభిప్రాయపడ్డారు. స్థానికంగా పండించే చిన్నరకం ఉల్లి విదేశాలలో మంచి డిమాండ్ ఉంది. ప్రస్తుతం కోడ్ కారణంగా విదేశాలకు ఎగుమతిపై ఆంక్షలతో కనీసధర లభించడం లేదని రైతులు వాపోతున్నారు.

వేడుకగా పూజమ్మదేవి కరగ



ఉత్సవంలో పాల్గొన్న స్థానికులు

శిడ్లఘట్ట, మార్చి 26: పట్టణంలోని పూజమ్మదేవి కరగ ఉత్సవం ప్రాచీన సంప్రదాయాలకు అనుగుణంగా జరిగింది. ముళబాగిలుకు చెందిన విజయ్ కుమార్ కరగను ధరించారు. ఆలయ ప్రాంతంలోనూ, మారమ్మ సర్కిల్, కోటె సర్కిల్‌లో వాద్యగోష్ఠికి అనుగుణంగా కరగతో నృత్యం చేశారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు కరగకు గ్రామస్తులు విశేష పూజలు నిర్వహించారు. పండుగ వాతావరణం నెలకొంది.

సందడిగా కరగ

విజయపుర, మార్చి 26: దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలో ధర్మరాయ స్వామి, ద్రౌపదమ్మదేవి ఆలయ 85వ వార్షిక కరగ ఉత్సవం ఘనంగా జరిగింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కరగధారి భీమణ్ణ ఊరేగారు. పట్టణంలోని గాంధీచౌక్, శిడ్లఘట్టక్రాస్, దేవాలయాల వద్ద కరగధారి నృత్యాలు చేశారు. పలు చోట్ల గ్రామస్తులు కరగధారికి ఘనస్వాగతం పలికారు. తాలూకా వ్యాప్తంగా పలు ఉత్సవాలు కొనసాగుతున్నాయి.



కరగధారి భీమణ్ణ నృత్యం

వైట్‌ఫీల్డ్‌లో బైహిల్టన్ సేవలు

బెంగళూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు టెక్నాలజీ కేంద్రంగా పేరొందిన వైట్‌ఫీల్డ్‌లో డబుల్‌ట్రీ బైహిల్టన్ సంస్థ తన ఆధునిక విభాగాన్ని ఏర్పాటు చేసింది. కల్యాణి డెవలెపర్స్ సారథ్యంలో ఏర్పాటైన ఈ ప్రత్యేక హోటల్‌లో 185కు పైగా గదులు ఉన్నాయని సంస్థ ఉపాధ్యక్షురాలు జుబిన్ సక్సేనా వెల్లడించారు. పర్యాటకులకు వాణిజ్య కలాకలాపాలు జరిపేవారికి ఇది ఎంతగానో వెసలుబాటు కల్పిస్తుందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాల సదుపాయాలను సమకూర్చామని కల్యాణి డెవలెపర్స్ డైరెక్టర్ మోహన్‌రాజు వెల్లడించారు.

బీకే శివరాంకు రాజ్‌కుమార్ పురస్కారం

బెంగళూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కన్నడ జనశక్తి కేంద్ర ప్రతియేటా ఇచ్చే వరనటుడు డా.రాజ్‌కుమార్ సరిగన్నడ అవార్డుకోసం ఈ సారి రిటైర్డ్ పోలీసు ఉన్నతాధికారి సమాజసేవకుడు బీకే శివరాంను ఎంపిక చేసింది. పురస్కారం కింద రూ 25వేల నగదు, కంచుపతకం, ప్రశంసా పత్రం అందజేయనున్నారు. ఏప్రిల్ 18న సాయంత్రం జెసి.రోడ్డులోని కన్నడ భవనం నయనలో జరిగే కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త బరగూరు రామచంద్రప్ప ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. ప్రముఖ విమర్శకుడు మోహన్‌దేవ్ ఆళ్వా కార్యక్రమానికి అధ్యక్షత వహించనున్నారు. రిటైర్డ్ ఐజీపీలు గోపాల్ బి.హోసూరు, కే మోహన్‌రావ్‌లు అతిథులుగా పాల్గొంటారని సంస్థ అధ్యక్షుడు సీకే రామెగౌడ నగరంలో మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

రూ.17లక్షల విలువైన మొబైల్స్ స్వాధీనం

బెంగళూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బస్సులలో ప్రయాణించే ఐటీ ఉద్యోగులు, పాదచారులను టార్గెట్ చేసి దోపిడీకి పాల్పడుతున్న ఘటనలకు సంబంధించి హెచ్‌ఏఎల్ పోలీసులు వేర్వేరు కేసులకు సంబంధించి ముగ్గురిని అరెస్టు చేసి రూ.17లక్షల విలువైన మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఒక నిందితుడి నుంచి సుమారు 10లక్షల విలువైన వివిధ కంపెనీల 45 ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మరొక కేసులో ఇద్దరి నుంచి రూ.7లక్షల విలువైన 20 మొబైల్ ఫోన్లను సీజ్ చేశారు. వైట్‌ఫీల్డ్ విభాగం డీసీపీ శివకుమార్ మార్గదర్శకంలో పోలీసులు కార్యాచరణ నిర్వహించారు. నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని డీసీపీ కోరారు. నేరాలను ఛేదించేందుకు అత్యాధునిక సాంకేతిక విధానాలు ఉన్నా ప్రజల సహకారం తప్పనిసరి అన్నారు.